నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | ఆగస్టు 23, 2024 | www.navatelangana.com

ఓపెన్ ఇంటర్, పదిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ఈవిద్యా సంవత్సరానికి గాను ఓపెన్ ఇంటర్, పది తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెద్ద కొడపల్ ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ తరగతి చదివిన వారైనా పదికి అర్హులని, పదో తరగతి పాసైన వారు ఇంటర్కు అర్హులని తెలిపారు. ఈ నెల 8న ప్రారంభమైన ప్రవేశాలు ఎలాంటి అపరాధరుసుము లేకుండా సెప్టెంబర్ 10 వరకు ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల పనివేళల్లో గాని 986 6343898 నెంబరు సంప్రదించాలని కోరారు.

డీపీఎంలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మహిళా శక్తి కార్యక్రమంపైన డిపియంలు, అడిషనల్ పీడీతో ఛాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ హెచ్ జి బ్యాంక్ లింకేజి ప్రోగ్రెస్ చాల తక్కువగా ఉందని డిపిఎంలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలాల వారిగా సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పురోగతి సాధించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డిపిఎంలను ఆదేశించారు. జిల్లాలో 5 మహిళా శక్తి క్యాంటీన్‌లు 20 రోజుల్లో ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు డిఆర్డిఓ మురళీ కృష్ణ , డిపిఎం లు రవీందర్ రావు, సుధాకర్, రమేష్ బాబు, వకుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల.. వేదికపై సీపీ కల్మేశ్వర్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ తదితరులు

సామాజిక వివాదాల సత్వర పరిష్కారానికి కమ్యూనిటీ మీడియేటర్లు కృషి



- హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే
- వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించిన సీ.జే
- పైలెట్ ప్రాజెక్ట్‌గా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అమలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సామాజిక వివాదాల సత్వర పరిష్కారంలో కమ్యూనిటీ మీడియేటర్లు క్రియాశీలక పాత్ర పోషిస్తారని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆకాంక్షించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో తొలిసారిగా 2021 లో కమ్యూనిటీ మీడియేటర్ వ్యవస్థను ప్రవేశపెట్టి సత్ఫలితాలు సాధించడంతో, దానిని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా పైలట్ ప్రాజెక్ట్ కింద నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలలో కమ్యూనిటీ మీడియేటర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. వివిధ సామాజిక వర్గాల నుండి కమ్యూనిటీ మీడియేటర్లుగా ఎంపిక చేసిన వారికి గురువారం నిజామాబాద్ జిల్లా కోర్టు సముదాయంలోని లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమన్వయంతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24 వరకు మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ శిక్షణ తరగతులను వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే లాంఛనంగా ప్రారంభించగా, హైకోర్టు న్యాయమూర్తులు సుజోయ్ పాల్, కె.సురేందర్, జె.శ్రీనివాస్ రావు భాగస్వాములయ్యారు.

ఈ సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. సామాజిక వివాదాలు, కుటుంబ తగాదాలు వంటి వాటిని కమ్యూనిటీ మీడియేటర్లు (వాలంటీర్లు) మధ్యవర్తిత్వం ద్వారా ఇరు వర్గాలకు ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల సామాజిక వివాదాలు క్షేత్రస్థాయిలోనే సత్వరం పరిష్కారమయ్యేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. తద్వారా అనవసర ఖర్చుతో పాటు, సమయం వృధా కాకుండా అరికట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనేందుకు కూడా ఈ వ్యవస్థ దోహదపడుతుందని అన్నారు. శిక్షణ పొందిన వాలంటీర్లు తమతమ ప్రాంతాలలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసుకుని, పరస్పరం ఆమోదయోగ్యమైన రీతిలో వివాదాల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను శ్రద్ధగా ఆకళింపు చేసుకుని, సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని, ప్రయోగాత్మకంగా అమలులోకి తెస్తున్న ఈ కార్యక్రమం సత్ఫలితాలు అందించేలా అంకితభావంతో కృషి చేయాలని కమ్యూనిటీ మీడియేటర్లకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ రిసోర్స్ పర్సన్, రిటైర్డ్ సెషన్స్ జడ్జి మొహమ్మద్ షమీమ్, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరీ, నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి సునీతా కుంచాల, కామారెడ్డి సెషన్స్ జడ్జి వి.ఆర్.ఆర్.వరప్రసాద్, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్, న్యాయాధికారులు, రెండు జిల్లాలకు చెందిన కమ్యూనిటీ వాలంటీర్లు పాల్గొన్నారు.


హాజరైన కమ్యూనిటీ వాలంటీర్‌లు

అరకొర వేతనం.. ఆపై పెండింగ్

- మిషన్ భగీరథ కార్మికులకు ఆరునెలలుగా జీతాల్లేవ్
- కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ఆవేదన
- ఆందోళనతో దిగివచ్చిన ఏజెన్సీ.. రెండు నెలల వేతనం సర్దుబాటుకు హామీ
- ఏజెన్సీకి ప్రభుత్వం నుంచి రెండేండ్లుగా అందని నిధులు




ఇందల్‌వాయిలోని పంప్‌హౌజ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజల దాహార్తి తీర్చేందుకు షిఫ్టుల వారీగా 24/7 నిరంతరం కష్టపడుతున్నా.. ఆ కార్మికులకు అరకొర వేతనమే అమలవుతుంది. అది కూడా ప్రతి నెలా అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఆరు నెలలకు పైగా వేతనాలు అందకపోవడంతో పంపుహౌజ్‌ల వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. దీంతో ఏజెన్సీ నిర్వహకులు రెండు నెలల వేతనాలు ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. కాగా రెండేండ్లుగా ప్రభుత్వం నుంచి నిధులు రావట్లేదని సదరు ఏజెన్సీ నిర్వహకులకు వాపోతున్నారు. ప్రభుత్వం నేరుగా తమకు వేతనాలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

గత బీఆర్ఎస్ ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథను ప్రతిష్టాత్మకంగా ప్రకటించి 2018లో ఇందల్‌వాయి మండల కేంద్రంలో పంప్ హౌస్ నిర్మాణం చేపట్టారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా నళ్లల ద్వారా నీటిని అందించడానికి ఉమ్మడి జిల్లాలో మొత్తం ఆరు శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీనిలో ఎస్సారెస్పీ వద్ద బాల్కొండ జలాల్పూర్‌లో 2, జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో 1, ఇందల్ వాయి మండల కేంద్రంలో 1, కామారెడ్డి జిల్లాలోని సదాశివ నగర్ మండలంలోని మల్లన్న గుట్ట వద్ద 2 నీటి శుద్ధి నిర్మాణా కేంద్రాలను చేపట్టి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీటిని అందించాలని లక్ష్యంతో పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 870 గ్రామాలలోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందజేస్తున్నారు. రెండు రోజులుగా కార్మికులు సమ్మె చేయడంతో నీటి శుద్ధి కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాలలో రెండు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లకు ఫుల్ స్టాప్ పడింది.

నిర్వహణ ఏజెన్సీకి అప్పగింత

పంప్‌హౌజ్‌ల నిర్వహణ ప్రభుత్వం ఏజెన్సీకి అప్పగించింది. దీంతో నీటిని శుద్ధి చేసే ఆపరేటర్, సరఫరా చేసే ఆపరేటర్, ఫిల్టర్ ఆపరేటర్ క్లోరిన్ ఆపరేటర్లు గార్డెనర్లు వాచ్మెన్‌లను ఏజెన్సీల ద్వారా నియమించుకున్నారు. ప్రతినెల ఆయా ఏజెన్సీల వారు వీరికి వేతనాలు చెల్లించవలసి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు పంపు హౌజ్‌లలో సుమారు 300 మంది కార్మికులు పని చేస్తున్నారు. వివిధ కెటగిరిల వారీగా కార్మికులకు రూ.8 వేల నుంచి 20 వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు.

ఆరు నెలలుగా అందని వేతనం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను రెండు ఏజెన్సీలకు ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది. దీనిలో ఒకటి ఐహెచ్‌పి, ఇంకొకటి ఎవరెస్ట్ ఏజెన్సీలు ఉన్నాయి. ప్రతి ఏటా దీనిలో పనిచేసే కార్మికులకు విధిగా టార్చ్ లైట్‌లు, బూట్లు, రెయిన్‌కోటు, ఐడి కార్డులు తదితరాలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇవేవీ వారికి అందట్లేవు. అయితే వేతనాలు సైతం సకాలంలో చెల్లించకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని మధనపడుతున్నారు. ఈఎంఐలు చెల్లించేందుకు, కుటుంబాలు గడిచేం దుకు అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పీఎఫ్ డబ్బులు సైతం జమ కావట్లేదని ఆరోపిస్తున్నారు. వేతనాలు అడిగితే పనిచేస్తే చేయండి.. లేకుంటే మానేయండి అంటు వేధింపులకు గురి చేస్తున్నట్లు కార్మికులు వాపోతున్నారు. గత కొన్ని ఏండ్లుగా మిషన్ భగీరథ ను నమ్ముకుని కార్మికులుగా పనులను నిబద్ధత పనిచేసి వేతనాలు అడుగితే భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు సమాచారం.

రెండు రోజుల ఆందోళనతో స్పందించిన యాజమాన్యం

గత రెండు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నీటి శుద్ధి కేంద్రాలలో కార్మికులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడంతో ఏజెన్సీ నిర్వాహకులు ఎట్టకేలకు దిగివచ్చారు. గురువారం ఇందల్వాయి మండల కేంద్రంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని వారు సందర్శించి కార్మికులతో, విలేకరుల సమక్షంలో చర్చలు జరిపారు. ఈ నెల చివరి నాటికి రెండు నెలల వేతనాన్ని అందజేయడం జరుగుతుందని ఇదే కాకుండా పిఎఫ్ ,ఈఎస్ఐ ,డ్రెస్సులు, టార్చ్ లైట్లు, ఐడి కార్డులు ఇతరత్రా కార్మికులకు అందజేయడం జరుగుతుందని విలేకరుల ముందు ఏజెన్సీ నిర్వాహకులు మాటిచ్చారు. తమకు ప్రభుత్వం నుండి ఒక్క ఏజెన్సీకే 50 కోట్ల రూపాయల పై బడి డబ్బులు రావాల్సి ఉందని, గత రెండేళ్లుగా తమకు నిధులు రాక కార్మికులకు చెల్లించడం లేదని, ఎప్పుడైనా ప్రభుత్వం నుండి డబ్బులు వచ్చిన వెంటనే కార్మికులకు ప్రతినెల డబ్బులను అందజేస్తామని తెలిపారు. రెండేళ్లుగా డబ్బులు రాకున్నా కార్మికులకు వేతనాల రూపంలో అప్పుడప్పుడు అందజేస్తూనే ఉన్నామని ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొన్నారు.



పంప్‌హౌజ్ ఎదుట బైటాయించి నినాదాలు చేస్తున్న కార్మికులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని రామేశ్వర పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంతోష్ రెడ్డి (39) మంగళవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లాడు. అప్పులు ఎక్కువైన కారణంగా వాటిని తీర్చే మార్గంలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు కుటుంబీకులకు ఫోన్ చేశాడు. కుటుంబీకులు హుటాహుటిన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా గుర్తుతెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న సంతోష్ ను కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేట ఆసుపత్రికి తరలించారు. బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మరణించగా పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. మృతుడు సంతోష్ రెడ్డి జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాలో సూపర్వైజర్ గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా సంతోష్ రెడ్డికి భార్య పిల్లలు ఉన్నారు.

ఎన్‌పీడీఎస్‌ఎల్ కార్మికుల దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు


హైదరాబాద్ తరలిన కార్మికులు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్‌పీడీఎస్‌ఎల్ అన్‌మ్యానుడు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా చౌక్‌లో చేపట్టిన నిరసన దీక్షలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఎన్పీడీసీఎల్ కంపెనీలో కార్మికులకు ఆర్టిజన్స్‌గా గుర్తించిన విధగా ఎన్పీడీసీఎల్ కంపెనీ లో వున్న అన్ మ్యానుడు కార్మికులను కూడా ఆర్టిజెన్స్‌గా గుర్తించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ప్రమాదంలో చనిపోయిన అన్ మ్యానుడు కార్మికుల కుటుంబానికి 10 లక్షలు ఎక్సగ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ప్రెసిడెంట్ కె. ఈశ్వర్ రావు, ఎన్పీడీసీఎల్ కంపెనీ నాయకులు సుధాకర్ , స్వామి కామారెడ్డి జిల్లా సిఐటియు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, రవి, ప్రతాప్ రాజు, నితిన్, హరిలింగం, సాగర్, నగేష్, లింగం, బాలరాజు లు పాల్గొన్నారు.

రుణమాఫీ అమల్లో విఫలం

- అనేక కొర్రీలు పెట్టి రైతులను మోసం చేసిన ప్రభుత్వం
- ఆంక్షలు లేకుండా రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ చేయాలి
- ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలు చోట్ల ఆందోళనలు


కమ్మర్‌పల్లిలో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి


మద్నూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-విలేకరులబృందం

'రుణమాఫీ అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలైమంది. అనేక మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి రాగానే రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తి విఫలమైంది. అనేక కొర్రీలు పెట్టి రైతులను రుణమాఫీ నుంచి దూరం చేసింది. నిబంధనలు తొలగించి 2 లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని' బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అదే విధంగా ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా గురువారం పలు మండలాల్లో ఆందోళనలు చేపట్టారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిరసనలు చేపట్టారు.

మాయమాటలతో అన్నదాతలకు కుచ్చుటోపి

కంఠేశ్వర్ : మాయమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కుచ్చుటోపి పెట్టిందని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో ధర్నా చేపట్టారు. డిసెంబర్‌లో 49 వేల కోట్లు మాఫీ చేస్తామని తొలుత చెప్పారని, జనవరి వచ్చేసరికి రూ. 40 వేల కోట్లు, జూలై నాటికి రూ. 31 వేల కోట్లు, చివరికి బడ్జెట్లో ఇచ్చింది రూ. 26 వేల కోట్లు కేటాయించినట్టు చెప్పి అందులో రూ . 17 వేల కోట్లు మాఫీ చేస్తున్నట్టు తెలిపారని చెప్పారు. తీరా రుణమాఫీ అయింది రూ.7500 కోట్లు అని అన్నారు. 41.78 లక్షల మంది రైతులు ఉంటే 22 లక్షల మందికి రుణమాఫీ అయిందని, ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేసేంత వరకు రైతు ద్రోహి ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్రం నాయకులు రామ్ కిషన్ రావు, నగర అధ్యక్ష కార్యదర్శులు సిర్ప రాజు, మాజీ నూడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

24న ఆర్మూర్‌లో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ధర్నా : వేముల

కమ్మర్‌పల్లి : ఎలాంటి షరతులు లేకుండా రైతులు అందరికీ రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు పేపర్లు పట్టుకొని రుణమాఫీ కోసం ఆఫీసుల చుట్టూ తిరగాలా? అని ఆయన ప్రశ్నించారు. ఈనెల 24న ఆర్మూర్ లో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన రైతులను కోరారు. వేల్పూర్, బాల్కొండ మండల కేంద్రాల్లో నిర్వహించిన ఆందోళనల్లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. రైతు బాగుంటేనే దేశం, సమాజం సుభిక్షంగా ఉంటుందని కేసీఆర్ భావిస్తారని, అందుకే కేసీఆర్ గత 10 సంవత్సరాలుగా రైతు వ్యవసాయ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు తీసుకున్నారన్నారు. ఏక కాలంలో రుణ మాఫీ అని మొత్తం మూడు విడతల్లో మమ అనిపించారని విమర్శించారు.

కామారెడ్డి : ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ 2 లక్షల రూపాయల రుణ మాఫీ చేయాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద రుణమాఫీ కానీ రైతులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ కాక వారు కన్నీళ్లు పెడుతూ రోడ్లపైకి వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ముజిబుద్దీన్, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేషరతుగా రుణమాఫీ చేయాలి : మాజీ ఎమ్మెల్యే షిండే

బిచ్కుంద/మద్నూర్ : ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు 2 లక్షల వరకు రైతు రుణాలను ఎలాంటి ఆంక్షలు నియమ నిబంధనలు విధించకుండా బేషరతుగా రుణమాఫీ చేయాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే డిమాండ్ చేశారు. గురువారం బిచ్కుంద మండల కేంద్రంలోని రైతు సహకార సంఘం ప్రాంగణంలో రైతులతో నిర్వహించారు. అంతకుముందు మద్నూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 20 శాతం రైతులకు రుణమాఫీ చేసి మిగతా రైతులకు ఇబ్బందులకు గురి చేస్తూ బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి కల్పించిందని అన్నారు. రైతులకు, కౌలు రైతులకు రైతుబంధు సైతం అమలు చేయడం లేదని అన్నారు. బిచ్కుందలో మాజీ ఎంపీపీ అశోక్ పటేల్, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరిబాలాజీ, భీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రావు దేశాయ్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీహరి రాజు, మద్నూర్‌లో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బన్నిపటేల్, ప్రధాన కార్యదర్శి వై గోవిందు, మాజీ సింగిల్ విండో చైర్మన్ పాకాల వార్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




కామారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మాజీ విప్ గంపగోవర్ధన్ ఆధ్వర్యంలో.. నిజామాబాద్‌లో ధర్నా చౌక్‌లో బిగాల ఆధ్వర్యంలో ధర్నా

గల్లంతైన బాలిక మృతదేహం లభ్యం

- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు


బాలికమృతదేహాన్ని వెలికి తీస్తున్న మున్సిపల్ సిబ్బంది

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం తన ఇంటిముందు అడుకుంటు ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడిన అనన్య (2) గల్లంతు అయిన సంగతి తెలిసిందే. గురువారం ఉదయం 6గంటల తరువాత పాప మృతదేహం నగరంలోని పీఎఫ్ కార్యాలయం వద్ద గల దోబిఘాట్ వద్ద లభ్యమైంది. నిజామాబాద్ నగరంలోని వర్ని రోడ్ లో గల ఆనంద్ నగర్ ప్రాంతంలో నాలుగు గంటల ప్రాంతంలో అనన్య తోటి స్నేహితులతో కలిసి ఆడుకునే సమయంలో డ్రైనేజీలో పడి గల్లంతు ఘటన విషాదాన్ని మిగిల్చింది. బుధవారం సాయంత్రం నుండి గురువారం ఉదయం వరకు ప్రత్యేక రెస్క్యూ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది గాలిస్తున్న నేపథ్యంలో అదే డ్రైనేజ్ పరిధిలో 100 మీటర్ దూరంలో అనన్య మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసుకొచ్చినట్లు రెస్క్యూ టీం సిబ్బంది తెలిపారు. అయితే తమతో కలిసి సరదాగా ఆడుతూ పాడుతూ తిరిగిన అనన్య మృతిచెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని వన్నెల్ బి గ్రామంలో ఎల్‌ఆర్‌ఎస్ 2020 సంవత్సర దరఖాస్తులను డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ గురువారం పరిశీలించారు. అనంతరం అమ్మ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ గంగామోహన్, ఇరిగేషన్ ఏఈ లింబాద్రి, బాల్కొండ, వన్నెల్ బి పంచాయతీ కార్యదర్శులు రజినీకాంత్ రెడ్డి, శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు

ముప్కాల్ ఎస్ఐగా వి.రజినీకాంత్


బాధ్యతలు చేపడుతున్న ఎస్ఐ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ నూతన ఎస్ఐగా వి.రజినీకాంత్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ శాఖ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేస్తూ స్వాగతం పలికారు. దాదాపు గత రెండు సంవత్సరాలుగా మండలంలో ఎస్ఐగా బాధ్యతలను నిర్వర్తించిన సిహెచ్.భాస్కరాచారి బదిలీలలో భాగంగా నిర్మల్ జిల్లా కుంటల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా.. ఆయన స్థానంలో కుంటల ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వి.రజినీకాంత్ ముప్కాల్‌కు వచ్చారు. ఏఎస్సై సురేష్ ఆధ్వర్యంలో నూతన ఎస్ఐకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక ఏఎస్సై సురేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ఏఎంసీ పాలకవర్గం పాటుపడాలి

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- ఘనంగా బోధన్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం


బోధన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే


ఎడపల్లి: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మహిళ సంఘాల సభ్యులు

నవతెలంగాణ-బోధన్/ఎడపల్లి

రైతుల అభివృద్ధికి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నిరంతరం పాటు పడేలా కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం ఏఎంసీ ఆవరణలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఎంసీ చైర్మెన్‌గా అంకు సంధ్య దామోదర్, వైస్ చైర్మెన్‌గా చీల శంకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని విడిపించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని దానికి రైతులు చెరుకు సాగుకు చొరవ చూడాలన్నారు. అలాగే రూద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు అధిక దిగుబడి చెరుకు వంగడాలను అభివృద్ధి చేయాలన్నారు. గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి మొదటి విడతలో లక్ష, తర్వాత లక్షన్నర, ప్రస్తుతం రెండులక్షల రూపాయల రుణమాఫీ చేస్తున్నామని అన్నారు. బ్యాంకులలో సాంకేతిక కారణాల వలన కొంతమంది రైతులకు రుణమాఫీ ఆలస్యమవుతుందని వారందరికి త్వరలో రుణమాఫీ చేస్తామన్నారు. ఇప్పటికే రుణమాఫీకి కోట్ల రూపాయల నిధులను వెచ్చించిందని అన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని సూచించారు. మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి రైతుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ పద్మ, ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, ఏసీపీ శ్రీనివాస్, తాహెర్, గడుగు గంగాధర్, గంగాశంకర్, నరేందర్ రెడ్డి, మంధర్న రవి, పాషా మోహినోద్దిన్, నాగేశ్వర్ రావు, ఏఎంసీ కార్యదర్శి రామ్‌నాథ్‌రావు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

ఎడపల్లి :స్వయం సహాయక సంఘాల మహిళాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఒక గ్రూపునకు రూ.10లక్షల చొప్పున రుణాలు అందిస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఇందిరాక్రాంతి పథం గ్రామ మహిళ సంఘం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఐకెపి నూతన గ్రామ మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించిన అనంతరం భవన ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అన్ని వర్గాల ప్రజలకు తమ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీనిచ్చారు. డిఆర్‌డిఏ అధికారితో ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలకు కుట్టు మిషన్లు, పాడి పరిశ్రమ, ఇతర చిరువ్యాపార రంగాలలో రాణించేందుకు ప్రోత్సహించాలని ఆయన డిఆర్‌డిఏను ఆదేశించారు. కార్యక్రమంలో ఎడపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, బ్లాక్ కమిటీ జిల్లా అధ్యక్షులు బిల్లా రామ్మోహన్, ఉర్దూ అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, మంగళ్ పాడ్, కుర్నపల్లి, జైతాపూర్, తనాకలాన్ మాజీ సర్పంచులు, ఉపసర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఫీడింగ్ ప్రోగ్రాంపై శిక్షణ


శిక్షణలో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గంగస్తాన్ ఫేజ్-2 వివేకానంద ధ్యాన మందిరంలో సూపర్‌వైజరీ సప్లిమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాంపైన శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశుసంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ పాల్గొని లోప పోషణను తగ్గించడానికి మహిళా శిశుసంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ సమన్వయంతో పని చేయాలని అన్నారు. 1000 రోజుల ప్రాముఖ్యతపైన దృష్టి పెట్టాలని, సూపర్‌వైజరీ సప్లిమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాం కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారిణి యస్‌కే రసూల్ బీ, డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ రాజశ్రీ, సీడీపీఓలు, మెడికల్ ఆఫీసర్లు, ఐసీడీస్, హెల్త్ సూపర్ వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్స్ పాల్గొని సూపర్ వైజరీ సప్లిమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాం కార్యక్రమంలో ఆరు అంశాలపై శిక్షణనిచ్చారు.

కోతుల, కుక్కల బెడద



నవతెలంగాణ-పోతంగల్

మండలంలో పలు గ్రామాలలో వీధి కుక్కలు ఒకవైపు కోళ్లను వేటాడుతూ.. తలుపులు వేయకుండా ఉన్న ఇండ్లలోకి చొరబడి ఆహారాన్ని ఎత్తుకుపోతున్నాయి. మరోవైపు కోతులు ఇంటి పైకప్పు (కూనపెంకులు) తీసి ఇంటిపై చిందరవందర చేస్తున్నాయి. తద్వారా వర్షం వస్తే ఇంట్లో నీరు కారేటట్లు చేస్తూ.. పిల్లలను, పెద్దలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తినే వస్తువులను ఎత్తుకుపోతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామాల్లో కుక్కల, కోతుల బెడదను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతివిద్యార్థికీ వ్యక్తిత్వ వికాసం అవసరం

- పూర్వవిద్యార్థి డా.హన్మంత్ రావు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హన్మంత్‌రావు

నవతెలంగాణ-పోతంగల్

ప్రతీ విద్యార్థికి వ్యక్తిత్వ వికాసం అవసరమని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థి, ప్రస్తుతం అమెరికాలో స్థిరపడిన ప్రసిద్ధ డాక్టర్‌గా సేవాలందించే డా.హనుమంతరావు అన్నారు. గురువారం పిల్లలకు వ్యక్తిత్వ వికాసంపై ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా తన అనుభవాలను చెప్పారు. తన నిజ జీవితంలో సాధించిన విజయాలను వివరించారు. విద్యార్థులకు ప్రేరణగా నిలిచి, ప్రతి ఒక్కరికి జీవితంలో ఒక లక్ష్యం ఉండాలని, దానిని సాధించడానికి నిరంతరం కృషిచేయాలని తెలిపారు. అంకిత భావం, త్యాగం, మానవత్వం వారికి మరింత శోభనిచ్చి, ఉన్నతశిఖరాలను అధిరోగించడానికి దోహదపడుతుందని తెలిపారు. ఆ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సాయిలు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు, ఉన్నత స్థానాలలో ఉన్నారని వారందరు పాఠశాలకు ఆదర్శమని, వారందరూ, ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకులని తెలిపారు.

సరైన ఓటర్ల జాబితాకు సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ మకరంద్


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మకరంద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సరైన ఓటర్ల జాబితాకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మకరంద్ సూచించారు. గురువారం నిజామాబాద్ నగరంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటి సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు నమోదు, షిఫ్ట్ అయిన వారి వివరాలు, మరణించిన వివరాలు మొదలైనవి బూత్ లెవల్ ఆఫీసర్లకు అందజేసి సరైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని కోరారు. సమావేశంలో నార్త్ తహసీల్దార్ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూమన్న, దాసు


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నరేంద్ర మోడీ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, వెంటనే కార్మిక వ్యతిరేక విధానాలు వీడనాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూమన్న, దాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని కోటగల్లీలోని ఎన్.ఆర్.భవన్‌లో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన్న, దాసు మాట్లాడుతూ.. మోడీ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను, మూడు క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూ జీవోలను గెజిట్‌లో ఎక్కించాలని తదితర డిమాండ్లపై జాతీయ కమిటీ పిలుపు మేరకు 13 సెప్టెంబర్ 2024న నిజామాబాద్ నగరంలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఇదే అంశంపై సెప్టెంబర్ 27వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. మోడీ ప్రతి ఏటా రెండు కోట్ల కొలువులు మాటవిస్మరించి, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని, ప్రైవేటీకరిస్తుందని వారన్నారు. దేశంలో కుటీర పరిశ్రమలను బీడీ, జూటు పరిశ్రమలను దెబ్బతీస్తుందని, లక్షలాది కుటుంబాలను బజారు కీడుస్తుందని వారు తెలిపారు. 2016 అక్టోబర్ 26వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. స్వచ్ఛ భారత్ పేరుతో పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి సన్మానిస్తే సరిపోదని వారి వేతనాలు పెంచి క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలపై దృఢంగా పోరాడుతుందని వారు తెలిపారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు సూర్య శివాజీ, శివకుమార్, జేపీ గంగాధర్, పద్మ, భారతి, దాల్మల్కి పోశెట్టి, సాయిబాబా, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సేవల్లో లోపం

- ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి


మురికి కాలువను పరిశీలిస్తున్న ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మున్సిపల్ సేవల్లో లోపం ఉందని ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్, సందు ప్రవీణ్ అన్నారు. ఇది వినియోగదారుల రక్షణ చట్టం 2019లోకి వస్తుందని, కాబట్టి నిజామాబాద్ ఆనందనగర్ కాలనీలోని కాలువలో పడి మరణించిన అనన్య ఘటనకు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత వహిస్తుందని తెలిపారు. సమితి ప్రతినిధులు శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నగరంలోని కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన అనన్య కుటుంబ సభ్యుల మానసిక వేదనకు పరిహారంగా మున్సిపల్ కార్పొరేషన్ రూ.50లక్షలు చెల్లించాలని వినియోగదారులు ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేనట్లయితే బాధిత కుటుంబ సభ్యుల తరపున వినియోగదారుల కమిషన్ (కోర్టు) ఫిర్యాదు దాఖలు చేయనున్నట్లు ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ప్రతినిధులు పెందోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్, వి.యస్.వర్మ, గైని రత్నాకర్, మహాదేవుని శ్రీనివాస్, రవి కుమార్ తెలిపారు.

బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో మండల వాసులకు చోటు

- కృతజ్ఞతలు తెలిపిన నాయకులు




నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గంలో ఎడపల్లి మండల వాసులకు చోటు దక్కింది. ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి సహాయ సహకారంతో సభ్యులుగా నియామకమయ్యారు. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన బొబ్బిలి శ్రీనివాస్, జైతాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం అధ్యక్షులు కరటూరి సత్యనారాయణ, జానకంపేట గ్రామానికి చెందిన శేఖర్, పోచారం గ్రామానికి చెందిన నీరాడ్డి సాయన్నను మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కృషి వల్లే తమకు ఈ పదవులు వచ్చాయని నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు తెలిపారు. గురువారం బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంతో బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దాము దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు బిల్లా రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులు


లక్కీడ్రా నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆర్టీసీ ప్రధాన కార్యాలయం వారి ఆదేశం మేరకు నిజామాబాద్ నుంచి వరంగల్ రూట్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన డీలక్స్ బస్సులలో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గిఫ్ట్‌బాక్సు నుంచి డ్రా తీసి ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులను అందజేయనున్నట్టు వివరించారు. అందులో భాగంగా 01.08.2024 నుంచి 15.08.2024 మధ్య కాలంలో నిజామాబాద్ నుంచి వరంగల్ రూట్లో ప్రయాణం చేసిన ముగ్గురు మహిళా ప్రయాణికులను గురువారం ఎంపిక చేశారు. నిజామాబాద్ ప్రధాన బస్టాండులో సౌత్ ఇండియా షాపింగ్ మాల్, నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో డ్రా ద్వారా మహిళా విజేతలను ఎంపికచేశారు. వరలక్ష్మి జగిత్యాల, సరస్వతి, మద్దేపల్లి (నవీపేట్), రాణి, రాయికల్ (జగిత్యాల్) విజేతలుగా నిలిచారు. ఈ విజేతలకు సౌత్ ఇండియా షాపింగ్ మాల్, నిజామాబాద్ వారి సౌజన్యంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మన్ రావు, శ్రీ గోవర్ధన్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, సత్యనారాయణ అసిస్టెంట్ మేనేజర్, స్టేషన్ మేనేజర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'నాటుదాం ఒక మొక్క.. అమ్మ పేరు మీద'


మొక్కను నాటుతున్న పంచాయతీ కార్యదర్శి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో గురువారం 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాస్ చేతుల మీదుగా మొక్కలను నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు నాటుదాం ఒక చెట్టు.. అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగస్వాములై తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను అమ్మపై చూపించే ప్రేమ లాగా.. మొక్కలను కూడా ప్రేమతో పెంచాలన్నారు. మనం నాటి పెంచే మొక్కలు భవిష్యత్తు తరాలకు ప్రాణవాయువు అందిస్తాయి అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ మారుతీ, సీనియర్ మేట్ ఆర్పీ రాజు, నాయకులు యస్.మురళి, ఆశన్న, గంగాధర్, రాజేష్, సంపత్, రాకేష్, రవీందర్, మురళీ పంతులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నాటుతున్న మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేయాలి

- ఎంపీడీవో అనంతరావు


మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీడీవో

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నాటుతున్న ప్రతి మొక్కకూ ట్రీగార్డులు కచ్చితంగా ఏర్పాటు చేసి సాసర్ ఫీట్లు చేయించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనంత్ రావు ఉపాధి హామీ సిబ్బందిని అదేశించారు. గురువారం ఇందల్‌వాయి మండలంలోని గన్నారం స్వాగత తోరణం వద్ద, ఇందల్‌వాయి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి జాతీయ రహదారి 44 కమాన్ వరకు రోడ్డుకు ఇరువైపులా 'మొక్కలు నాటుదాం అమ్మ పేరుపైన'అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతరావు పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పచ్చదనం పరిశుభ్రతను పాటించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన వనమహోత్సవ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాలలో తమ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని, మొక్క పెట్టడమే కాకుండా దానిని సంరక్షించే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఏపీవో ఒడ్డెం పోశెట్టి, టెక్నికల్ అసిస్టెంట్ మోతీరాం, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, భరత్, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, కారోబార్ పోచయ్య, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవించిన గర్భిణీ



నవతెలంగాణ-బోధన్

రెంజల్ మండలం పేపర్‌మిల్ గ్రామానికి చెందిన ధృపద అనే గర్భిణీ పురిటినొప్పులతో బాధపడగా స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దాంతో సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది గర్భిణిని తీసుకుని రెంజల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మార్గమధ్యలో సాటాపూర్ సమీపంలో అంబులెన్స్‌లో ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ పైలట్ నాగరాజు, ఈఎంటీ రాధాకృష్ణ తెలిపారు.

రాజ బహదూర్ వెంకట్రాంరెడ్డి జయంతి వేడుకలు


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలోని బోర్గాం (పి) గ్రామంలో రాజ బహదూర్ వెంకట్ రామ్‌రెడ్డి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈగ రమేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసి ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, మంత్రి దామోదర రాజనరసింహతో కలిసి జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం కలిశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ , ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , కాలె యాదయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు , మాజీ ఎంపీ పసునూరి దయాకర్ పాల్గొన్నారు.


సీఎంను కలిసిన పలువురు నాయకులు

నీటిని కాచి వడగట్టి తాగాలి

నవతెలంగాణ-రామారెడ్డి

నీటిని కాచి వడగట్టి తాగాలని రామారెడ్డి పిహెచ్‌సి వైద్యులు సురేష్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్లో వైద్య శిబిరాన్ని నిర్వహించి 43 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ జైపాల్, వైద్య సిబ్బంది జార్జ్, జానకమ్మ, గంగామణి, ఆశాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిహెచ్‌సి వైద్యులు సురేష్

మొక్కలు నాటి సంరక్షించాలి

నవతెలంగాణ-పిట్లం

మొక్కలను నాటి సంరక్షించాలని ఎంపీడీవో కమలాకర్ అన్నారు. గురువారం మండలంలోని హస్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో 'నాటుదాం ఒక మొక్క - అమ్మ పేరు మీద' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యానికి, కాలుష్య నివారణకు, మానవాళి మనుగడకు చెట్లే ఆధారము కనుక ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడంపై ఆసక్తి కనబరిచి ఇంటి పెరటి తోటలోనూ, పంట చేను ఒడ్డులపై మొక్కలు నాటి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు సైతం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ మహేష్, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, గ్రామ పంచాయతీ సెక్రెటరీ నారాగౌడ్, అంగన్వాడీ టీచర్ రాధిక ఏఎన్ఎం అంజలి, ఆశ వర్కర్ లక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

లింగంపేట్: మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర సహాయకులు ఆయా శాఖలకు చెందిన అధికారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. లింగంపేట్‌లో ఎంపీడీవో నరేష్ ఎమ్మార్వో నరేందర్ ఎంపీఓ మలహరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, కుమార్ బీట్ ఆఫీసర్ పర్వీన, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య, శంకర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


లింగంపేట్: మొక్కలు నాటిన అధికారులు, గ్రామస్తులు


బిచ్కుంద: పిచ్చి మొక్కలను తొలగిస్తున్న గ్రామస్తులు

మొక్కలు నాటిన అటవీశాఖ సిబ్బంది

ఎల్లారెడ్డి: నాటుదాం ఒక మొక్క అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో గురువారం నాడు మొక్కలు నాటినట్లు అటవీ శాఖ అరేంజ్ అధికారి ఓంకార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని సూచించారు. చెట్లను పెంచడానికి ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం మంచి పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాస్, సెక్షన్ అధికారి వినోద్, భాస్కర్,విక్కి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రాంగణంలో బిచ్కుంద గ్రామపంచాయతీ సిబ్బంది ముళ్ళ చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించి ట్రాక్టర్ ద్వారా చదును చేసి గడ్డి మందు స్ప్రే చేసారు. అనంతరం నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గ్రామాలలో ఫీవర్ సర్వే

నవతెలంగాణ-భిక్కనూర్

మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాలలో పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించడం వంటి వివరాలు ప్రజలకు వివరించారు. ప్రస్తుత కాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధుల గురించి వివరిస్తూ జాగ్రత్తలు పాటించాలని, ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి యేమిమా, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న ఆశావర్కర్లు

గడ్డి మందు పిచికారీ


గడ్డి మందు పిచికారీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో విచ్చలవిడిగా గడ్డి పొదలు పెరిగిపోవడంతో ఇటీవల నవతెలంగాణ పత్రికలో వచ్చిన వరస కథనాలకు స్పందించి గురువారం నాడు మున్సిపల్ సిబ్బంది 11వ వార్డు వీధుల్లో రోడ్ల వెంబడి గడ్డి మందు పిచికారి చేశారు. దీంతో కాలనీ వీధిలో గడ్డి పొదలు విచ్చలవిడిగా పెరగకుండా అదుపు చేయడానికి నివారణ చర్యల్లో భాగంగా గడ్డి మందు స్ప్రే చేయడం వలన పాములు దోమల బెడద కొంతవరకు తగ్గే అవకాశం ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడాకారులకు ఏకరూప దుస్తులు పంపిణీ


విదార్థులకు ఏకరూప దుస్తులు అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న రన్నింగ్ క్రీడాకారుల విద్యార్థులకు బీఆర్ఎస్ యువ నాయకులు గంగల రవీందర్ ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్, పిడి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు రాజు, నాయకులు ప్రవీణ్, వేణు, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీ చెప్తే.. డాటా చోరీ

- ఎస్సై మహేందర్

నవతెలంగాణ-పెద్దకొడప్గల్

మండల కేంద్రంలోనీ ప్రధాన కూడలి వద్ద ఎస్ఐమహేందర్ పోలీస్ సిబ్బందితో గురువారం పరిసర ప్రాంత గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ ఏవిధంగా పెరుగుతుందో సైబర్ నేరాలు కూడా అదే విధంగా పెరుగుతున్నాయని ఆయన అన్నారు. మహిళలు, పిల్లలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని వ్యక్తిగత సమాచారాన్ని దోచేస్తున్నారని ఆయన అన్నారు. ఆన్లైన్ వినియోగం పెరగడం వలన దీన్ని ఆసరా చేసుకొని సైబర్ నేరగాళ్లు తక్కువ వడ్డీకే లోన్లు ఇస్తామని, తక్కువ డబ్బులకే వాహనాలు ఇప్పిస్తామని ప్రజలకు బురీడీ కొట్టిస్తున్నారని ఆయన అన్నారు. అనవసరమైన లింకులను ఓపెన్ చేయకూడదని అలా ఎవరైనా ఓపెన్ చేస్తే వారి వ్యక్తిగత సమాచారాన్ని దొంగలించి వారికే తిరిగి వేధింపులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ నేరాల బారిన పడకుండా పోలీస్ శాఖ సైబర్ క్రైమ్, ఉమెన్ సేఫ్టీ వింగ్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని. సైబర్ నేరాలు నియంత్రించడంలో ఉపాధ్యాయులు తమవంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్‌కి ఎవరైనా గురైనట్లయితే వెంటనే 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలోకానిస్టేబుల్ వెంకట్,మౌనిక, హెూం గార్డ్ సంజు రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై మహేందర్

అంగన్‌వాడీ సెంటర్‌ల సందర్శన


తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్ దేవకరణ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో నూతనంగా వచ్చిన సూపర్‌వైజర్ దేవకరణ గురువారం ప్రాజెక్టు పరిధిలోని మద్నూర్, డోంగ్లి మండలాలను సందర్శించారు. పలు అంగన్‌వాడీ సెంటర్లు మద్నూర్ మండలంలోని సోనాల, మదన్ హిప్పర్గలోని రెండు సెంటర్‌లతో పాటు డోంగ్లి మండలంలోని లింబూర్ లోని రెండు సెంటర్ సందర్శించారు. అంగన్ వాడీలకు వస్తున్న పిల్లల సంఖ్యను ఆరా తీశారు. సెంటర్‌ల నుంచి అందుతున్న పోషకాహారంపై వాకబు చేశారు.

రేషన్ డీలర్‌ల భర్తీకి

మెరిట్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలో ఖాళీగా ఉన్న ఐదు డీలర్‌షిప్ పోస్టుల భర్తీ కోసం ఇటీవల ఆర్డిఓ అధ్యక్షతన జరిగిన రాత పరీక్షలు ఇంటర్వ్యూలు పూర్తికాగా రాత పరీక్షల్లో ఇంటర్వ్యూలో మెరిట్ సాధించిన అభ్యర్థుల లిస్టు ఆర్డీవో కార్యాలయం నుండి మద్నూర్ తాసిల్దార్ కార్యాలయానికి అందింది. కాగా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ ఎండి ముజీబ్ గురువారం పరిశీలించారు.

మద్నూర్ మండలంలోని హెచ్ కెలూరు డీలర్ షిప్ కోసం అత్వాల్ వార్ శ్రీనివాస్ మెరిట్ సాధించగా అదేవిధంగా మండలంలోని శాఖాపూర్ డీలర్ షిప్ కోసం ఇబత్ వార్ బల్వీరా మెరిట్ సాధించారు. ఇక మద్నూర్ మండల కేంద్రంలోని షాప్ నంబర్ 2 దీనికోసం బెల్లాల్ సంజయ్ మెరిట్ సాధించారు. అదేవిధంగా మద్నూర్ షాప్ నంబర్ 4 దానికోసం కర్రే వార్ హెూం బాయి మెరిట్ సాధించారు. మద్నూర్ 5వ షాప్ నెంబర్ కోసం కర్రే వార్ లక్ష్మణ్ మెరిట్ సాధించినట్లు మెరిట్ లిస్ట్ ప్రకారం వారి ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్నట్లు తాసిల్దార్ ఎండి ముజీబ్ తెలిపారు.


ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న తహసీల్దార్

స్థానిక సంస్థ ఎన్నికలలో విజయం సాధించాలి


మాట్లాడుతున్న బిజెపి పార్టీ మండల అధ్యక్షులు

నవతెలంగాణ-భిక్కనూర్

రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో బిజెపి బలపరిచే అభ్యర్థులు విజయం సాధించాలని బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ సూచించారు. గురువారం మండలంలోని జంగంపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఇంటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి ఏ విధంగా అన్యాయం చేస్తుందో వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, గ్రామ అధ్యక్షులు నరేందర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

నవతెలంగాణ-పిట్లం

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే ఇంప్లిమెంటేషన్ చేయాలని దళిత మాదిగ (దండోరా) నాయకులు కోరారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ పై ప్రభుత్వము సిద్ధంగా ఉందని ప్రకటించిన మేరకు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి వర్గీకరణ బిల్లు ఆమోదింప చేయాలని అన్నారు. ఆలస్యం అవుతున్న కొద్దీ కొన్ని వర్గీకరణ వ్యతిరేక పోరాటా సమితి నాయకులు వర్గీకరణ పై లేనిపోని ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో బిల్లు తక్షణమే కార్యరూపం దాల్చడం అనివార్యమైనందువల్ల ప్రభుత్వం జోక్యం చేసుకొని దళిత వర్గాల ఉప కులాల వారికి సముచిత న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మాదిగ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎనిగే హన్మాండ్లు , బక్క ఇమ్మానుయేల్ , జంగం లక్ష్మణ్ , జంగం బాలు , బర్రెమ్ బాలరాజ్ , జంగం భూమేష్ , చిలుక భూమయ్య , ఎనిగే శ్రీరాములు , ఎనిగే సాయిలు , గులని రాములు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భావజాలాలతో పనిచేయాలి


నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఎస్సీలందరూ అంబేద్కర్ భావజాలంతో పనిచేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎంఆర్పిఎస్ మహిళ అధ్యక్షురాలు సత్తి గారి లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 75 సంవత్సరాలు 59 కులాల సంపదను కేవలం మాల సామాజిక వర్గమే అనుభవించిందనీ, ఈ రిజర్వేషన్ అమలు అయితే మాలలకు రిజర్వేషన్ల ప్రకారం తక్కువ వస్తే ఓర్వలేక 59 కులాల వనరులను ఒకే ఒక వర్గానికి చెందితే మరి మిగతా కులాలు ఏం కావాలనీ మాల సోదరులు అర్థం చేసుకొని సుప్రీంకోర్టు ద్వారా వర్గీకరణ విషయములో సహకరించాలన్నారు. ఇకనైనా మాల సోదరులు అంబేద్కర్ భావజాలాలతో పని చేయాలన్నారు. సమాన న్యాయం అందరికీ రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి మండల అధ్యక్షుడు రమేష్, రామారెడ్డి, మండల అధ్యక్షుడు రాజనర్సయ్య, రామారెడ్డి మహిళా అధ్యక్షురాలు లావణ్య, రాజంపేట మహిళా అధ్యక్షురాలు సుజాత, కామారెడ్డి టౌన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని బంజపల్లి గ్రామానికి చెందిన కడారి సవిత (20) అనే యువతి మెదక్ గ్రామానికి చెందిన తన స్నేహితురాలు ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదని నిజాంసాగర్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కేజీబీవీలలో బదిలీ నిబంధన తప్పనిసరిగా అమలు చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

కేజీబీవీలలో బదిలీల నిబంధనలో గరిష్ట కాల పరిమితి నిబంధన లేకపోవడం వలన ఈ బదిలీలు కొందరికి ప్రయోజనకరంగా ఉంటాయనీ టి పి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనీల్ కుమార్ అన్నారు. గురువారమిక్కడ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి సుదూర ప్రాంతాలలో ఒకే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలగచేస్తుందనీ, ప్రభుత్వం వెంటనే 8 సంవత్సరాల గరిష్ట నిబంధనను అమలు చేయాలని టిపిటిఎఫ్ జిల్లా శాఖ తరపున డిమాండ్ చేస్తున్నా మన్నారు. కనీస కాలపరిమితి రెండు సంవత్సరాలు పెట్టినప్పుడు గరిష్ట కాల పరిమితి 8 సంవత్సరాలు పెట్టడం వలన ఎక్కువ మంది ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేజీబీవీ లలో పనిచేసే వృత్తి, విద్యా శిక్షకులకు బదిలీలు చేపట్టాలన్నారు. కేజీబీవీలలో అనేక సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించే విధంగా సెలవు నిబంధనలో మార్పులు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

తండాలో ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలం లోని భయంపల్లి కిషన్ నాయక్ తండాలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ హిమబిందు తెలిపారు. 40 మందికి వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి జ్వరం ఉందన్నారు. వారి నుంచి రక్తనమూనాలు సేకరించి టెస్టుకు పంపగా.. డెంగీ నెగెటివ్ వచ్చినట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పట్ల, వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఫరీదా బేగం, ల్యాబ్ టెక్నీషియన్ సుభాష్ లక్ష్మణ్ రాజేశ్వరి శాంత మహిమోద ఆశ వర్కర్లు ఉన్నారు.


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు


కామారెడ్డి: కేక్ కట్ చేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి/రామారెడ్డి

తెలంగాణ ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ ప్రభుత్వ సలహాలదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తనయుడు యూత్ కాంగ్రెస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇలియాస్ జన్మదిన వేడుకలు గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. కాగా మాజీ సర్పంచ్‌లు చందుపట్ల విఠల్, గీరెడ్డీ మహేందర్ రెడ్డి, మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు అంకన్న గారి నాగరాజ్ గౌడ్ కేక్ కట్ చేయించి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శపల్లె సాయికిరణ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు మహమ్మద్ ఇలియాస్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం హైదరాబాదులోని తన నివాసంలో మద్దికుంట మాజీ సర్పంచ్ తోట గంగయ్య తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకుడు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కేజీబీవీ పాఠశాలను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని కేజీబీవీని డీఈఓ దుర్గాప్రసాద్ గురువారం సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. పాఠశాల ప్రాంగణం, వంట గది, విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినిల పట్ల ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. అనంతరం ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లడంతో ఉపాధ్యాయులు డీఈఓను సన్మానించారు. కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సంధ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు ఉన్నారు.



పాఠశాలను సందర్శిస్తున్న డీఈఓ

దోమల నివారణకు బీఆర్ఎస్ నేత కృషి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో దోమల నివారణకు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొత్తపల్లి అశోక్ సొంత ఖర్చులతో నడుం బిగించారు. కొద్ది రోజులుగా కమ్మర్‌పల్లి గ్రామంలో దోమల బెడద పెరిగిపోయింది. ఇదే సమయంలో సీజనల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తన కర్తవ్యంగా కొత్తపల్లి అశోక్ తన సొంత ఖర్చులతో గ్రామంలోని అన్ని వీధుల్లో, గొల్లపేట గాంధీనగర్, ఇందిరమ్మ కాలనీలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అశోక్ సేవా భావాన్ని గ్రామస్తులు కొనియాడుతూ అభినందిస్తున్నారు.



దోమల నివారణ మందు పిచికారీ ప్రారంభం

నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో ప్రక్షాళన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ ప్రక్షాళన చేశారు. ఈ మేరకు గురువారం నగరంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సంబంధిత సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో నగరపాలక సంస్థ పారిశుధ్య ఆరోగ్య విభాగంలో బదిలీలు జరిగాయి. అలాగే ఇంటి నెంబర్ల కేటాయింపులో కీలక విభాగమైన రెవెన్యూ విభాగంలో కొంత మంది బిల్ కలెక్టర్లను వారి సొంత విభాగానికి పంపుతూ ఉత్తర్వులు ఇచ్చారు. రెవెన్యూ విభాగం నుంచి సొంత విభాగానికి పంపించిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. మల్లేష్ పబ్లిక్ హెల్త్ వర్కర్, లక్ష్మణ్ పబ్లిక్ హెల్త్ వర్కర్, సాయిరాం, సాయి విశ్వప్రకాష్ పబ్లిక్ హెల్త్ వర్కర్, నరేష్ పబ్లిక్ హెల్త్ వర్కర్, రాజేందర్ పబ్లిక్ హెల్త్ వర్కర్, శంకర్ పబ్లిక్ హెల్త్ వర్కర్ వీరి స్థానంలో రెగ్యులర్ ఉద్యోగులను బిల్ కలెక్టర్లుగా నియమించారు. వారి పేర్లు లింబాద్రి, గంగాధర్, అశోక్, ప్రేమ్, ఎమ్ గంగాధర్, రఫీక్, సాయన్న, శ్రీకాంత్, మహేష్, మధుసుదన్, ఎస్ గంగాధర్, సుమన్, రాజారాం, దత్తు, నరేందర్, ప్రమీల ఇటీవల బదిలీపై వొచ్చిన బిల్ కలెక్టర్ల పేర్లు - సలీముద్దీన్, మోహినుద్దీన్, రవికుమార్ అని తెలియజేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విధులు కేటాయించినవారు శ్రీనివాస్, సుభాష్, గంగమల్లు, బాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, బిల్ కలెక్టర్ విధుల నుంచి విరమించిన బిల్ కలెక్టర్లతో ట్రేడ్ లైసెన్సులు, ఆస్తి పన్నుల విభాగంలో సర్వేకు కేటాయిస్తూ కమిషనర్ మకరంద్ ఆదేశాలు ఇచ్చారు. ఆరోపణలు ఎక్కువగా వస్తున్న రెవెన్యూ విభాగంలో సంపూర్ణ ప్రక్షాళనకు కమిషనర్ దృష్టి సారించారు.



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్.. అధికారులు

పాడి పశువులు పౌల్ట్రీ యూనిట్ లబ్దిదారులకు శిక్షణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ ప్రభుత్వం పాడి పశువులు పౌల్ట్రీ యూనిట్ లబ్దిదారులకు శిక్షణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి మండల పశువైద్యాధికారి హాజరై మాట్లాడుతూ.. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా శాఖ వారి ఆధ్వర్యంలో పాడి పశువులు, పౌల్ట్రీ లబ్దిదారులకు శిక్షణ కార్యక్రమంలో ఆవులు, గేదెలు, పెరటి కోళ్ళు, మదర్ యూనిట్ ఏర్పాటు చేసుకునే వారి గురించి పశువులను ఏ విధంగా పెంచాలి, ఏ విధంగా గడ్డి వేయాలి, ఏ విధమైన వ్యాధులకు నివారణ చర్యలు చేపట్టాలనే విషయాలను సవివరంగా వివరించారు. నాటు కోళ్ల పెంపకం గురించి వివరిస్తూ నాటు కోళ్ల ఆరోగ్యానికి చాలా మంచివని ప్రతి ఒక్కరూ నాటు కోళ్ల పెంచుకొని కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. అదేవిధంగా ప్రతి ఇంటికి పాడి పశువులు ఉంటే అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడుస్తారని తెలియజేశారు. ప్రభుత్వం ద్వారా పాడి పశువులు పెరటి కోళ్ల పెంపకం చేపట్టేవారు పలు జాగ్రత్తలు తీసుకొని లాభాలు పొందాలని, అవసరమైతే పశువైద్యాధికారి నుంచి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. పాడి పశువులను ఇతర రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి తీసుకురావాలని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందరూ పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్‌రెడ్డి, మండలంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన పాడి పశువుల, నాటు కోళ్ల పెంపకం లబ్దిదారులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారిణి

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డిచ్‌పల్లి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి యువకులకు శిక్షణ ప్రారంభమవుతుందని ఆర్ఎస్ఈటిఐ సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రారంభం కానున్న శిక్షణ ఇదే..

సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ 13రోజులు, సెల్‌ఫోన్ మరమ్మతులు 30రోజులు, ఏసీ మరమ్మతులు 30 రోజులు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పదోతరగతి, ఐదు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణా పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు. శిక్షణా అనంతరం ధృవీకరణ పత్రం, టూల్ కిట్ కూడా అందజేస్తామని వివరించారు. వివరాలకు 08461-295428 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలలో స్మైల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్మైల్స్ విద్యార్థి జిల్లా స్థాయి చెస్ పోటీలలో మూడవ స్థానం పొందినట్టు పాఠశాల డైరెక్టర్ రఫీ గోహర్ గురువారం తెలిపారు. జిల్లాలోని వినాయక్‌నగర్ అభ్యాస స్కూల్‌లో జరిగిన డిస్ట్రిక్ లెవెల్ చెస్ ఛాంపియన్‌షిప్ స్మైల్స్ ద స్కూల్‌కు చెందిన డి.సోహన్ ఐదు రౌండ్లకు గానీ నాలుగు రౌండ్లు గెలుచుకొని మూడో స్థానం గెలుచుకున్నారు. డి.శ్రీహన్ ఐదు రౌండ్లకు గానూ మూడు రౌండ్లు గెలుచుకొని డిస్ట్రిక్ లెవెల్ ఐదో స్థానంలో ప్రైజ్ అందుకున్నాడు. డి శ్రోహన్ స్మైల్స్ ద స్కూల్లో నాలుగో తరగతి చదువుతుండగా, డి.శ్రీకాంత్ ఒకటో తరగతి చదువుతున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కస్పాండెంట్ షబానా గోహర్, సిబ్బంది సింధూజ, స్వప్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు మెమోంటోతో సత్కరించారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన ముదిరాజ్ సంఘం సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం భవనం కోసం రూ.20లక్షలు మంజూరు చేసినందుకు మాజీ మంత్రి, ఎంఎల్ఏ ప్రశాంత్ రెడ్డికి ముదిరాజ్ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం వేల్పూర్‌లోని స్వగృహంలో ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ముదిరాజ్ సంఘం సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. పెద్దమ్మతల్లి ఆలయానికి ధూప దీప నైవేద్యాలు ప్రభుత్వం ద్వారా మంజూరు చేసినందుకు, ముదిరాజ్ సంఘం కోసం రూ.20 లక్షల మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పిట్ల సత్యం, ముద్దిరాజ్ సంఘం పెద్ద మనుషులు గారాయి రవి, మొండి రవి, లోపం మహిపాల్, టికాయి బాలయ్య, పసుల మహేష్, శ్రీనివాస్, దమ్మయి గంగాధర్, గౌరయి జీవన్, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన జీవన్‌రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి మాజీ సర్పంచ్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ కాట్పల్లి సత్యమ్మ నర్సారెడ్డి తల్లి మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో మరణించడంతో వారి కుటుంబాన్ని కొలిప్యాక గ్రామంలో జీవన్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామ శాఖ అధ్యక్షుడు



ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కొంటికంటి నరేందర్ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని వేల్పూర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నరేందర్ ఇటీవల కమ్మర్‌పల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. తనను గ్రామ శాఖ అధ్యక్షునిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్‌ను ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి-2 మాజీ ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మల్యాల సుభాష్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రైతు విభాగం మండల అధ్యక్షులు బద్దం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని చింతించొద్దు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

రుణమాఫీ కాలేదని రైతులు చింతించొద్దని వ్యవసాయ కార్యాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, ఎస్సై జి.మహేష్ సూచించారు. గురువారం మండలంలోని దేవన్‌పల్లి గ్రామంలో రుణమాఫీ కాని రైతులకు అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్సై

రుణమాఫీ ఫిర్యాదుల కోసం స్పెషల్ డ్రైవ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల చొప్పున పంట రుణమాఫీ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి గత మూడు దఫాలలో రెండు లక్షల రూపాయల లోపు పంట రుణాలు కలిగి ఉన్న కుటుంబాలకు రుణమాఫీ చేపట్టిందని బాల్కొండ తహశీల్దార్ అడప శ్రీధర్ తెలిపారు. రెవెన్యూ వ్యవసాయశాఖ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జలాల్‌పూర్‌లో రైతు రుణమాఫీకి సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో రెండు లక్షల లోపు పంట రుణాలు కలిగి ఇంకా రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి లావణ్య మాట్లాడుతూ.. వివిధ సాంకేతిక కారణాలవల్ల రెండు లక్షల రూపాయలలోపు పంట రుణాలు కలిగిన కొంతమంది రైతులకు రుణమాఫీ జరగలేదని అటువంటి వారి కోసం మండల కేంద్రంలో రుణమాఫీ ఫిర్యాదుల నమోదు కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. భార్యా భర్తలు, వారి మైనర్ సంతానం కలిపి ఒక కుటుంబంగా పరిగణిస్తారని, కావున రెండులక్షల రూపాయల లోపు రుణం కలిగిన రైతు కుటుంబాలకు ఎవరికైనా రుణమాఫీ జరగనట్లయితే రుణమాఫీ ఫిర్యాదుల కేంద్రంలో అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని ఈ సందర్భంగా రైతులను కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో బాల్కొండ ఎస్సై బి.నరేష్, వ్యవసాయ విస్తరణ అధికారిని రేష్మ రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను నివారించాలి

- ప్రజాసంఘాల డిమాండ్

నవతెలంగాణ-ఆర్మూర్

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అరికట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి మాట్లాడుతూ.. ఈ వర్షాకాలంలో అనేక వ్యాధులు వస్తున్నాయని, ఈ వ్యాధుల పట్ల ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉన్నప్పటికీ సరైన చికిత్స అందక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యాధులకు ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి చుట్టూ పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అనూస్, విద్యార్థి సంఘం ఆర్మూర్ ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి బట్టు రవి, మహిళా సంఘం నాయకులు రామక్క, సత్తెక్క, పద్మ, లక్ష్మి, గంగాధర్, మోహన్, బాల్కొండ మోహన్, నరేష్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రజాసంఘాలు

మూడవ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘంపై ఆరోపణలు అవాస్తవం

- భవానీ గీత పారిశ్రామిక సహకార సంఘం



నవతెలంగాణ-కంఠేశ్వర్

మూడవ కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘంపై పలువురు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని భవానీ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ అన్నారు. గురువారం కేసీఆర్ కాలనీలోని భవానీ గీత కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఏ శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి వివిఎల్ఎన్ గౌడ్, డైరెక్టర్లు శ్యామ్, రాజగౌడ్, ట్యాపర్ సాయ గౌడ్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా తమ మూడవ కల్లు డిపోపై కొందరు అసత్య ప్రచారం చేస్తూ తమ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. తమ డిపోలో 63 మంది ట్యాపట్లు, 400 పైన సభ్యులు ఉన్నారని వీరందరికీ ట్యాపర్లకు సంవత్సరానికి లక్ష చొప్పున, నాన్ ట్యాపర్లకు సంవత్సరానికి 18 వేలు మాముల చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నామన్నారు. మా సంఘం బలోపేతంగా ఉందని లేనిపోని ఆరోపణలు చేస్తూ తమపై బురదజల్లే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో డిపో డైరెక్టర్లు శ్యాంసుందర్ గౌడ్, తిరుమలేష్ గౌడ్, లాలా గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, రాజగౌడ్, సుభాష్‌గౌడ్, ట్యాపర్లు సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

- తనిఖీలు నిర్వహించాలి



మాట్లాడుతున్న యుఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్లో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు

యునైటెడ్ భారత విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణ కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్దల నాగరాజు, పెద్ది సూరి మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకులాలు, రెసిడెన్షియల్ కాలేజీ హాస్టల్ దాదాపు 50కి పైగా ఉన్నాయని, అనేక హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేకమార్లు సంబంధిత శాఖ అధికారులకు విషయం తెలియజేసినా ఫలితం మాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గణేష్, మారుతి, జిల్లా సహాయ కార్యదర్శి వేణు, అభిరాం, జవహర్ తదితరులు పాల్గొన్నారు

ఫార్మాస్యిటికల్ కెమిస్ట్రీకి చెందిన మామిడి విష్ణువర్ధన్.. యూనివర్సిటీకే గర్వకారణం



విష్ణువర్ధన్‌ను అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యిటికల్ కెమిస్ట్రీ కోర్స్ 2022లో పూర్తిచేసిన విద్యార్థి మామిడి విష్ణువర్ధన్‌కు సౌత్ కొరియా గ్రీన్ ఫ్లెయిన్ ఇండస్ట్రీ వారు 21 లక్షల వార్షిక వేతనంతో శాస్త్రవేత్తగా ఉద్యోగ నియామకపు ఉత్తర్వులు అందజేసిన సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యం.యాదగిరి గురువారం తన చాంబర్‌లో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈమధ్య కాలంలో తెలంగాణ యూనివర్సిటీలో ఇంత భారీ మొత్తం వేతనంతో నియామకమైన విష్ణువర్ధన్ చరిత్ర సృష్టించాడని, ఇది యూనివర్సిటీకి గర్వకారణమని, తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ల సలహాలను సూచనలను తీసుకుని విద్యార్థులు విష్ణువర్ధన్ వలే ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు మామిడి విష్ణువర్ధన్‌ను ఆదర్శంగా తీసుకొని భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలలో ఉన్నతమైన విద్యాసంస్థలలో పరిశోధనలు చేసి శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. విష్ణువర్ధన్ ఐఐసిటి హైదరాబాద్‌లో తెలంగాణ విశ్వవిద్యాలయం ఫార్మాస్యిటికల్ కెమిస్ట్రీ విభాగం ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ అనే అంశంపై లోతైన పరిశోధనతో గుర్తింపు తెచ్చుకున్నాడు. తన నియామకం పట్ల నిర్మాణాత్మకమైన సలహాలను సూచనలు అందించిన విభాగపు ఆచార్యులు డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ శిరీష బోయపాటి, డాక్టర్ సత్యనారాయణరెడ్డి ఆచార్యులందరికీ తాను రుణపడి ఉంటానని విష్ణువర్ధన్ పేర్కొన్నారు.

సభ్యత్వ నమోదు కన్వీనర్‌గా జెస్సు అనిల్ కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్‌ను దేశవ్యాప్త సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్వహించబడే సభ్యత్వ నమోదు కార్యక్రమం దృష్ట్యా అసెంబ్లీ సభ్యత్వ నమోదు కార్యక్రమ సహా కన్వీనర్‌గా గురువారం నియమించారు. ఈ నియామకానికి కృషి చేసిన ఎంపీ అరవింద్ ధర్మపురి, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, అదేవిధంగా సభ్యత నమోదు కార్యక్రమం జిల్లా కన్వీనర్ పుప్పాల శివరాజ్ కుమార్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

సీపీఎస్ వ్యతిరేక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోధన్

సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా నిర్వహించే కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పీఆర్టీయూ డివిజన్ అధ్యక్షులు ఎంబెల్లి శంకర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం 2018 ఆగస్టు 23న జీవో నెంబర్ 28 అమలు చేస్తూ సిపిఎస్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం సిపిఎస్ విధానానికి అనుకూలంగా జీవో నెంబర్ 28ను అమల్లోకి తీసుకొచ్చి ఉద్యోగుల ఉపాధ్యాయులు తీరని అన్యాయానికి గురిచేసిందని, కావున జీవో 28ని రద్దుచేసి ఉద్యోగుల్ని, ఉపాధ్యాయుని పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా తెలంగాణలో ఆగస్టు 23 సిపిఎస్ వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటున్నట్టు పేర్కొన్నారు. టెక్నికల్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ధనరాజ్, అర్బన్ మండల అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు ఖైరాన్, గంగాధర్, మండల ఉపాధ్యక్షులు వీరేష్ బాబు, నిజాముద్దీన్, శంకర్, ప్రాథమిక సభ్యులు సిపిఎస్ బాధితులు తదితరులు పాల్గొన్నారు

ఫంక్షన్‌హాల్ నిర్మాణ టెండర్ కాపీ అందజేత


నిర్మాణకాపీని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండల కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించబోయే ప్రజా ఫంక్షన్ హాల్ నిర్మాణ టెండర్ కాపీని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఏర్గట్ల గ్రామాభివృద్ధి కమిటీకి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. మినరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఈరవత్రి అనిల్, కోపరేటివ్ సొసైటీ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి చొరవ చూపి, సహకారం అందించడంతో ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి అడుగులు పడ్డాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, మునిరోద్దీన్, రేండ్ల రమేష్, రొక్కెడ సంజీవ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

చిరుత కాదు.. జంగపిల్లి


జంగపల్లి మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు


నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలో మృతి చెందింది చిరుత పులి కాదని.. జంగ పిల్లి అని అటవీ రేంజ్ అధికారి రవీందర్ గురువారం తెలిపారు. అటవీ రేంజ్ పరిధిలో చిరుతపులి మృతి చెందిందన్న వార్తలు వచ్చిన నేపథ్యంలో అటవీ రేంజ్ అధికారి రవీందర్‌ను సంప్రదించగా మృతి చెందింది జంగ పిల్లి అని స్పష్టం చేశారు. అటవీ రేంజ్ పరిధిలోని కమ్మర్‌పల్లి బీట్ కంపార్ట్మెంట్-2 గండి హనుమాన్ అటవీ ప్రాంతంలో ఈ జంగపిల్లి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. గురువారం ఉదయం పశువుల కాపరుల ద్వారా సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని, పంచనామా నిర్వహించామన్నారు. మృతి చెందిన జంగపిల్లికి పోస్టుమార్టం చేయించి, అటవీ ప్రాంతంలోనే పూడ్చిపెట్టినట్లు తెలిపారు.

తవ్వినకొద్దీ అక్రమాలు

« తాజాగా ఎరువుల అవినీతి బాగోతం.. « 'సహకారం'లో బయటపడుతున్న అక్రమాలు

- నామమాత్రంగా అధికారుల విచారణ
- రికవరీలపై అధికారులు దృష్టి సారించేనా..?



ప్రయివేట్ కంపెనీ నుంచి తెచ్చిన బిల్లులు..


మాక్లూర్ సహకార సంఘం కార్యాలయం

నవతెలంగాణ-మాక్లూర్

మాక్లూర్ సహకార సంఘంలో గత నెల నుంచి జరిగిన అక్రమాలపై అధికారులు విచారణ చేపడుతున్న విషయం తెలిసిందే. అది పూర్తి కాకముందే మరో అవినీతి బయటపడింది. గతంలో జరిగిన ఎరువుల అక్రమాలపై అధికారులు ఆరా తీస్తుండగా.. మరోవైపు సొసైటీ కమిటీ, సిబ్బంది ఎరువుల విక్రయాల్లో చేతి వాటం ప్రదర్శించారు.

మాక్లూర్ సొసైటీకి గ్రోమోర్ 20-20 ఎరువు ఒక బస్తా రూ.1020 కే ప్రభుత్వం అందిస్తుంది. దానిపై సొసైటీలో రూ.10 నుంచి రూ.20 కమీషన్‌తో అమ్ముకోవాల్సి ఉంటుంది. కానీ ప్రయివేట్ కంపెనీల వద్ద రూ.1090కి బిల్లు తీసుకొచ్చి మాక్లూర్ మండల కేంద్రంలో రూ.1120, గొట్టుముక్కల, డీకంపల్లి, కల్లెడ, గుత్ప గ్రామాల్లో గల కేంద్రాల్లో రూ.1140 చొప్పున అమ్ముతున్నారు. అంటే రైతులపై సుమారు రూ.100 భారం పడుతోంది. ఈ మిగులు డబ్బులను ఎవరు తీసుకుంటున్నారనేది ఉన్నతాధికారులు ఆరా తీయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో సుమారు ఆరు లారీల లోడు..

ఈ ఖరీఫ్ సీజన్‌కు సుమారు ఆరు లారీల 20-20 ఎరువులు వచ్చినట్లు సమాచారం. ఒక్కో లోడుకు 400 బస్తాలు వస్తాయి. ఆరు లోడుల్లో మొత్తం 2400 బస్తాలను దింపుకున్నారు. అయితే ఒక్కో బస్తా రూ.100 చొప్పున అధికంగా తీసుకుంటే 2400 బస్తాలకు రూ.2,40,000 అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమార్కులపై చర్యలు చేపట్టేనా..?

ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం విచారణ చేపడుతున్నామని సమాధానం చెబుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకుంటే మరో వ్యక్తి అక్రమాలు చేయకుండా ఉంటారని రైతులు అంటున్నారు. వెంటనే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అవినీతిలో కూరుకుపోయింది..

సహకార సంఘాలను ఆనాటి ప్రభుత్వాలు రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేశాయి. రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కాకుండా రుణాలు అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సహకార సంఘాల ముఖ్య ఉద్దేశం. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏటా కోట్లాది రూపాయల లావాదేవీలు జరుపుతుంటాయి. లక్షల రూపాయల ఎరువుల వ్యాపారం చేస్తుంటాయి. ధాన్యం కొనుగోళ్లు చేసి రైతులకు సొమ్ము జమ చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కలన్నింటినీ సంబంధిత సిబ్బంది ఆడిట్ చేయాల్సి ఉంటుంది. కానీ మాక్లూర్ సహకార సంఘం అవినీతి మరకల్లో కురుకుపోయింది. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని.. పాలకవర్గం, సిబ్బంది నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ జిల్లాలోనే అవినీతిలో నెంబర్‌వన్‌గా మార్చారు. సొసైటీలో అక్రమాల పరంపర మాత్రం ఆగటం లేదు.

మొక్కలు నాటి సంరక్షించడం ముఖ్యం

- ఎంపీవో కిరణ్‌కుమార్



నవతెలంగాణ-మోపాల్

మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో సంరక్షించడమూ అంతే ముఖ్యమని ఎంపీవో కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని బాడ్సి, సింగంపల్లి, కులాస్పూర్ గ్రామాలలో 'నాటుదాం ఒక చెట్టు.. అమ్మ పేరు మీద' అనే కార్యక్రమంలో భాగంగా మూడు గ్రామాలలో కలిపి 350 మొక్కలు నాటినట్టు ఎంపీఓ కిరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఈసీ సాగర్, పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, స్వప్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పలువార్డులలో చైర్‌పర్సన్ పర్యటన

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని 21,4,5,వ వార్డులను మున్సిపల్ చైర్ పర్సన్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ నెలకొన్న త్రాగునీరు సమస్య పరిష్కారం చూపించి , రోడ్లను,మురికి కాలువలను, శుభ్రం చేయించారు. ఇలాంటి పనులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతాన్నిస్తున్నట్టు తెలిపారు. జున్ 1, జున్ 2, గామాస్ క్లీనింగ్ కొరకు పెట్టినట్టుతెలిపారు. అలాగే గొల్లవాడలోని బుర్ర మత్తడి కాలువను పరిశీలించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్, తాటి ప్రసాద్ లావణ్య,జహీరా బేగం యామిన్,పాత శివ కృష్ణమూర్తి, పిడుగు మమతా సాయిబాబా, మున్సిపల్ అధికారులు తదితరులున్నారు.

మాట ఇచ్చిండ్రు.. బరాబర్ రుణమాఫీ జేయలే

- రుణమాఫీ కానీ రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకుల ధర్నా, నిరసనలు


ఆర్మూర్ : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి


నందిపేట్ : నిరసనలో పాల్గొన్న మాజీ జెడ్పీచైర్మెన్


బోధన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఓట్ల కోసం మాట ఇచ్చిండ్రు.. బరాబర్ రుణమాఫీ జేయాలని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తూతూ మంత్రంగా రుణమాఫీ చేసి రైతులను అరిగోస పెడుతుందని విమర్శించారు. గురువారం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజవర్గ, మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా రుణమాఫీ చేపట్టాలని కోరుతూ ధర్నాలు, నిరసనలు చేపట్టారు.

రైతుల ఉసురు ముఖ్యమంత్రికి తగులుతది..

ఆర్మూర్ : రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని, రైతుల ఉసురు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తగులుతదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆగస్టు 15 వరకు ఏకకాలంలో రుణామాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ 85 శాతం మందికి కూడా కాలేదని అన్నారు. రైతులతో పెట్టుకున్న ప్రభుత్వాలు భూస్థాపితం అయిపోయాయని, ఇందుకు తెలుగుదేశం కనుమరుగైపోయిందని అన్నారు. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని రైతుల ఉసురు రేవంత్‌రెడ్డికి తగులుతదని అన్నారు. కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు పూజ నరేందర్, కౌన్సిలర్లు గంగామోహన్, లింబాద్రిగౌడ్, పిప్రి, రాంపూర్, మిర్దాపల్లి గ్రామాల మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్ రెడ్డి, బంటు దయానంద్, మధు వర్మ, సొసైటీ చైర్మన్ సోమ హేమంత్‌రెడ్డి, అగ్గు క్రాంతి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను రోడెక్కించిన ఘనత.. రేవంత్ రెడ్డిదే..

నందిపేట్ : ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ ఆధ్వర్యంలో నంది విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు బెంటు వేసుకొని నిరసన చేపట్టారు. ఈ ధర్నాకు మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ షరతులు లేకుండా రూ.రెండులక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ రైతులను రాజు చేస్తే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి రైతులను రోడ్డెక్కేలా చేశారన్నారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అన్ని అర్హతలు ఉన్న రుణమాఫీ అవ్వలేదని కొందరు రైతులు వాపోయారు. మరి కొందరు రైతులు ఇంటి యజమానిపై పట్టా ఉండి క్రాప్ లోన్ మాత్రం తమ భార్యలపై ఉందని బీఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఏ ఒక్క పథకం ఆగలేదు..

డిచ్‌పల్లి : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క పథకం ఆగలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశామని, సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి గెలిచాక మాట మార్చిందని ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్ విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు 2 లక్షల రుణమాఫీని షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్ మోహన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 40 శాతం వరకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, ఇంకా 60 శాతం మేర రుణాలు మాఫీ కాలేవన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఏ పథకం కూడా ఆగలేదని, రుణమాఫీని అందరికీ వర్తింపజేసిన ఘనత అప్పటి సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, మాజీ ఎంపీపీ భదవత్ రమేష్ నాయక్, దాసరి లక్ష్మీనర్సయ్య, మాజీ మండల అధ్యక్షులు శక్కరికొండ కృష్ణ, నీరడి పద్మారావు, హన్మంతరావు, తనూజ శ్రీనివాస్ రెడ్డి, మొచ్చ శ్రీనివాస్, బుల్లెట్ అక్బర్ ఖాన్, కుంచాల రాజు, చింత మహేష్, బొల్లెంక గంగారెడ్డి, ధర్పల్లి యూత్ అధ్యక్షులు మోహమ్మద్ నజీర్, ఇందల్‌వాయి మండలాధ్యక్షులు చిలువేరి గంగాదాస్, ఒడ్డం నర్సయ్య, అంజయ్య, మహిపాల్ యాదవ్, దీకొండ శ్రీనివాస్, రఘునథన్ రాము, లక్ష్మీనారాయణ, బాజిరెడ్డి రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం..

బోధన్ : ఆరు గ్యారంటీ పేరుతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని డీసీసీబీ డైరెక్టర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గిర్దావర్ గంగారెడ్డి అన్నారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ తీరుకు నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తున్నామని కొంతమందికే అమలు చేశారని అన్నారు. రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ చేయకుండానే సీఎం రేవంత్ రెడ్డి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రైతు రుణమాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అరవై శాతం రైతులకు కూడా రుణమాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీపై రైతులు నిరాశ పరిచేలా ప్రభుత్వ తీరు ఉందన్నారు. రేషన్ కార్డు ప్రామాణికం కాకుండా ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ నిరసన బీఆర్ఎస్ నాయకులు పట్టణ అధ్యక్షులు రవీం దర్ యాదవ్, ఫ్లోర్‌లీడర్ బేంజర్ గంగారాం, నాయకులు నక్క లింగారెడ్డి, పెర్క రామకృష్ణ, రవిశంకర్ గౌడ్, నరేంద్ర బాబు, సంజీవ్ పటేల్, గణేష్, వెంకటి పటేల్ నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని హాసకొత్తూర్ చౌరస్తా వద్ద రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపులో భాగంగా బిఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో రుణమాఫీ రాని రైతులకు మద్దతుగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. హస్తం సర్కార్ కొర్రీలతో ఎంతోమంది అన్నదాతలకు రుణమాఫీ అందక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు మాట ఇచ్చిన ప్రకారం ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సామ బాపురెడ్డి, రైతుబంధు సమితి మండల మాజీ కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, రైతు విభాగం మండల అధ్యక్షులు బద్దం రాజశేఖర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 15లోపు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు కొద్దిమంది రైతులకు రుణమాఫీ చేసి, మరికొంత మంది రైతులకు రుణమాఫీ అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా, రైతులకు అండగా నిలుస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ముప్కాల్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గాంధీ విగ్రహం వద్ద రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. తహశీల్దార్ శ్రీకాంత్‌కు రుణమాఫీ అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్మూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బద్దం నడ్పన్న, సామ వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జోషి ఉమ శంకర్, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ఆకుల రాజేశ్వర్, కొమ్ముల మోహన్, బద్దం శ్రీనివాస్, విఘ్నేష్ గౌడ్, ప్రదీప్, శ్రీనివాస్ గౌడ్, మట్ట సందీప్, మారెల్లి విష్ణు, నిమ్మల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండల కేంద్రంలోని అమర వీరుల స్థూపం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు రైతు రుణమాఫీపై నల్ల జెండాలను చేతబట్టి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం మాట్లాడుతూ.. మండలంలోని రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పట్టాపాస్ బుక్ ఉన్న ప్రతి రైతుకు 2 లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. మండలంలోని 4264 మంది రైతులకు గాను కేవలం 997 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యిందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి రైతులు ఎవ్వరూ వెళ్ళవద్దని, మీకు కచ్చితంగా రుణమాఫీ జరుగుతుందని, అందుకోసం అప్లికేషన్ ఫారం నింపి వ్యవసాయాధికారి కార్యాలయంలో ఇవ్వాలని, నిరసన కార్యక్రమానికి వెళ్తే రుణమాఫీ అవుతుందో కాదో మాకు తెలియదని, స్థానిక కాంగ్రెస్ నాయకులు అంటున్నారని తెలిసిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు పూర్తి బాధ్యత తీసుకుని రైతులందరికీ రుణమాఫీ చేయిస్తే తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సన్మానిస్తామని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి స్థానిక ఎమ్మార్వో శ్రీలతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కొర్రీలు పెట్టకుండా రుణమాఫీ చేయాలి

నిజాంసాగర్ : కొర్రీలు పెట్టకుండా రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని ఉమ్మడి జిల్లాల జడ్పీ మాజీ చైర్మన్ దఫేదర్ రాజు డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిజంసాగర్ మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. అనంతరం ర్యాలీగా తాహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు పట్లోళ్ల దుర్గారెడ్డి, సొసైటీ చైర్మన్లు కళ్యాణి విఠల్ రెడ్డి, వాజిద్ అలీ, నరసింహారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, నాయకులు రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : రుణమాఫీ పేరుతో ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద రైతురుణ మాఫీ కోసం రైతులతో కలిసి పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా రెండు లక్షల రూపాయల రుణమాఫీ ప్రతి రైతుకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సగం మందికి కూడా మాఫీ చేయకపోవడం చాలా దారుణమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ దేశాయ్, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, సతీష్ యాదవ్, కాటేపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు శివకుమార్ పటేల్, మాజీ సర్పంచులు పోచయ్య, బస్సీ, తిర్మల్ రెడ్డి, పండరీనాథ్, పార్టీ నాయకులు సాయగౌడ్, మహమ్మద్ వీరేశం, అష్‌రాజ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : రైతులు తీసుకున్న రుణాలపై ఎలాంటి ఆంక్షలు లేకుండా 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నాడు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి ప్రాంగణం వద్ద మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం రుణమాఫీ చేయడం లేదని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సతీష్, మండల అధ్యక్షులు జలంధర్ రెడ్డి,సొసైటీ అధ్యక్షులు ఏగుల నర్సింలు,ఎరుకల సాయిలు, దేవదాస్, రఫిక్,సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : దోమకొండ మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గండ్ర మధుసూదన్ రావు నాయకుల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్, విండో చైర్మన్ తిరుపతి గౌడ్, పట్టణ అధ్యక్షులు బోరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి : నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్


నిజాంసాగర్ : నిరసనలో పాల్గొన్న నాయకులు


డిచ్‌పల్లి : నిరసనలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ